బచ్‌పన్ ప్లే స్కూల్ గ్రాడ్యుయేషన్ డే



వేడుకల్లో పాల్గొన్న స్కూల్ చైర్మన్ కోటిరెడ్డి, హెచ్‌ఎం తివారి

కుత్బుల్లాపూర్: చింతల్ వెంకటేశ్వరనగర్‌లోని బచ్‌పన్ ప్లే స్కూల్‌లో సోమవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాఠశాల చైర్మన్ బి.కోటిరెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాముఖ్యతను తెలుపే పాటపై విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం ప్రధానోపాధ్యాయులు తివారి చేతుల మీదుగా యూకేజీ విద్యార్థులకు మెడల్స్, గ్రాడ్యుయేషన్ పత్రాలు అందజేశారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి

హిమాయత్‌నగర్: యువత నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని బిలియన్ మ్యాన్, కేఎంపీఎస్ సంస్థ వ్యవస్థాపకుడు కుంట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మన దేశం ఆధ్యాత్మిక ప్రపంచం, వ్యాపార ప్రపంచం, సేవారంగ ప్రపంచం అనే ట్రైయాంగిల్ ప్రపంచం దిశగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం తమ సంస్థ ఆధ్వర్యంలో సీఈఓ ఇండియా పేరుతో జాతీయ స్థాయి కార్యక్రమాన్ని రూపొందించనున్నట్లు ఆయన వెల్లడించారు. యువతకు ఆధ్యాత్మిక సంపదను అందించాలని, ఐటీ, బీపీవోలతో పాటు వ్యాపార రంగాలలో మరింత అభివృద్ధి చెందాలని అందుకోసం తాము చేపట్టనున్న సీఈఓ ఇండియా అనే కార్యక్రమాన్ని ఎన్ఆర్ఐలతో పాటు పలువురు ప్రముఖుల సహకారంతో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వంద బృందాలతో రానున్న రోజుల్లో ఈ కార్యక్రమాన్ని దేశంలోని అన్ని జిల్లా కేంద్రాలలో నిర్వహించేందుకు కృషిచేస్తామని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

పారిపోయిన బాలనేరస్తుల్లో ముగ్గురి ఆచూకీ లభ్యం

సుభాష్‌నగర్: సూరారం పోలీస్‌స్టేషన్ పరిధి గాజులరామారంలోని జువైనల్ హోమ్ నుంచి ఈనెల 16న అర్ధరాత్రి ఎనిమిది బాలనేరస్తులు పారిపోయిన ఘటనలో ముగ్గురి ఆచూకీ లభించింది. సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకరిని, మోహిదీపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో ఇద్దరిని గుర్తించి వారి తల్లిదండ్రులు అప్పగించామని ఎస్సై నారాయణసింగ్ తెలిపారు. మిగతా వారి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

22మంది రౌడీషీటర్లను బైండోవర్ చేశాం

సూరారం ఇన్‌స్పెక్టర్ వెంకటేశం



సుభాష్‌నగర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో స్థానికంగా ఎలాంటి గొడవలు జరుగకుండా సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టి గస్తీని ఏర్పాటు చేశామని సూరారం ఇన్‌స్పెక్టర్ వెంకటేశం అన్నారు. గతంలో జరిగిన శాసన సభ ఎన్నికల నేపథ్యంలో పోలీస్‌స్టేషన్ పరిధిలో 16 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేశామనిఅరు. తాజాగా జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా 22మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. అల్లర్లు, అలజడి సృష్టించే వ్యక్తుల పట్ల నిఘా ఉంచామన్నారు. శాంతియుత వాతావరణంలో ప్రజలు ఓటు వేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని వ్యక్తి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: పుట్టింటికి వెళ్లిన భార్య రావడం లేదని... ఆర్థిక ఇబ్బందులు అధికంగా ఉన్నాయని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన సాహిత్ ఇస్లాం(23) పేట్ బషీరాబాద్ సమీపంలోని కార్మిక అడ్డాలో నివాసం ఉంటున్నాడు. ఇతడికి ఏడు నెలల క్రితం వివాహమైంది. రెండు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రాకపోవడం లేదని.. ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని తోటి కార్మికుల వద్ద వాపోయేవాడు. ఈ క్రమంలో స్థానికంగా నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో పనిచేస్తున్న ఇస్లాం ఆదివారం రాత్రి 10.30 సమయంలో ఇంట్లోకి వెళ్లి ఉరేసుకున్నాడు.

బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోవద్దు

- మల్కాజ్‌గిరి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి
- బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమావేశం
- అభ్యర్థితో కలసి జోరుగా ప్రచారం చేసిన ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: కొడంగల్‌లో ఓటమి పాలైన రేవంత్‌రెడ్డిని మల్కాజ్‌గిరి పార్లమెంట్ ప్రాంత ప్రజలు ఆదరిస్తే చేసిందేమీ లేదని... ఎంపీ నిధుల నుంచి ఒక్క పైసా కేటాయించకుండా ఆ ప్రాంత అభివృద్ధిని విస్మరించారని ఎమ్మెల్యే వివేకానంద్, మల్కాజ్‌గిరి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి విమర్శించారు. దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లిలోని ఎంఎం గార్డెన్స్‌లో సోమవారం బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

◆ ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్యే వివేకానంద్, రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్లుగా కుత్బుల్లాపూర్ నియోజవర్గ అభివృద్ధికి వందలాది కోట్ల నిధులను వెచ్చించామన్నారు. స్థానిక అభివృద్ధి, సమస్యలపై పట్టులేని బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డిలకు ఓటేసి మోసపోవద్దన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించాలంటే అది బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు.

ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి మల్కాజ్‌గిరికి ఏమి చేశారు?

◆ మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న రేవంత్‌రెడ్డి నేడు రాష్ట్ర సీఎంగా ఉన్నారన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఎంత ఖర్చు చేశారో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలకు కష్టాలు మొదలయ్యాయని విమర్శించారు. బీజేపీతో రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదన్నారు. తెలంగాణ భవిష్యత్, సంక్షేమానికి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ తుడుం పద్మారావు, దుండిగల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, బుచ్చిరెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ నాగరాజు యాదవ్, మాజీ జిల్లా మార్కెటింగ్ కమిటీ చైర్మన్ రవీందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బహదూర్‌పల్లిలో జరిగిన బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం..

కుత్బుల్లాపూర్ డివిజన్ మాణిక్యనగర్‌లో మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్‌చారి, బాలయ్య, రమేశ్ యాదవ్, శ్రీనివాస్, బ్రిజేష్, యాదగిరి, సంజీవరెడ్డి, అక్బర్, నసీర్, వెంకటేష్, అజయ్, రమణారెడ్డి, మధు, భాస్కర్‌రెడ్డి, శ్రీనాథ్, శివానంద్, మల్లేష్, నాగన్న, పాపిరెడ్డి, బుచ్చిరెడ్డి, కృష్ణారెడ్డి, నరేందర్, అరుణ, మనోహర, పుష్ప, నీలిమ, భాగ్య, రజియా, మైసమ్మ తదితరులు పాల్గొన్నారు.

గాజులరామారం, సూరారం డివిజన్లలో ప్రచారం..

◆ గాజులరామారం డివిజన్ పరిధిలోని మెట్‌కానిగూడ, మారుతినగర్, పెద్దమ్మగడ్డ బస్తీలలో ఎమ్మెల్యే వివేకానంద్ స్థానిక కార్పొరేటర్ రావులశేషగిరితో కలిసి ప్రచారం చేశారు. పాక్స్ డైరెక్టర్ పరిశె శ్రీనివాస్‌యాదవ్, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజ్, అడ్వకేట్ కమలాకర్, చెట్ల వెంకటేష్, చిన్న చౌదరి, బాబి, ఇబ్రహీం, మూసాఖాన్, మహేష్, గోపాల్, జునైద్, మహిళా అధ్యక్షురాలు సంధ్యారెడ్డి, సీనియర్ నాయకురాలు మామీ, ఊర్మిళ, రాధ, రజిని తదితరులు పాల్గొన్నారు.

◆ సూరారం డివిజన్ మార్కండేయనగర్‌లో ఎమ్మెల్యే డివిజన్ కార్పొరేటర్ సత్యనారాయణ, అధ్యక్షుడు పుప్పాల భాస్కర్‌లతో కలిసి ప్రచారం చేశారు.



సూరారం మార్కండేయనగర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

◆ జగద్గిరిగుట్ట డివిజన్ సీసాలబస్తీలో జరిగిన ఎన్నికల ప్రచారంలో శ్రీవెంకటేశ్వర దేవస్థానం చైర్మన్ వేణుయాదవ్, డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, శ్రమశక్తి అవార్డు గ్రహీత ఎత్తరి మారయ్య, సీనియర్ నాయకులు అజ్రత్ అలీ, బసవేశ్వర్, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

◆ ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు అఖిల్, ప్రధాన కార్యదర్శి సిద్దిక్, మహిళా అధ్యక్షురాలు హేమలతారెడ్డి, ఎస్ఆర్పీసీ చైర్మన్ అరుణ, సీనియర్ నాయకులు ఫిరోజ్, మార్కండేయనగర్ అధ్యక్షులు విశల్, మైనారిటీ వైస్ ప్రెసిడెంట్ జమీల్, నవీన్, రెహమాన్, వైకుంఠం,లావణ్య,ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్ నిర్మాణానికి శంకుస్థాపన...

కుత్బుల్లాపూర్ డివిజన్ మాణిక్యనగర్‌లోని శ్రీకామాక్షి సమేత ఏకాంబరనాథ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ పునర్ నిర్మాణ శంకుస్థాపన మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్, మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాణిక్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్, ఆలయ కమిటీ చైర్మన్ సురేష్, ఉపాధ్యక్షుడు నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేష్, నారాయణరెడ్డి, రఘునాథ రెడ్డి, మధు, అరుణ్, కేవీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పూజలు..

దుండిగల్ మున్సిపాలిటీ బహదురుపల్లిలోని వినాయకనగర్‌లో నూతనంగా నిర్మించిన విజయ గణపతి దేవస్థానంలో విజయ గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథులుగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్, ఆలయ ధర్మకర్త సగ్గిడి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



ఆలయ శంకుస్థాపనకు హాజరైన ఎమ్మెల్యే వివేకానంద్, మాజీ కార్పొరేటర్ గౌరీష్

పరిష్కరించాల్సిన వారే పరిష్కారం కోసం ధర్నా

ఇంటి పన్ను తగ్గించాలని ప్రజలతో కలసి నిరసన తెలిపిన కార్పొరేటర్లు



బాచుపల్లిలో వార్డు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్పొరేటర్లు, ప్రజలు

నిజాంపేట్: సమస్యలు పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులే సమస్య పరిష్కారం కోసం ధర్నాకు దిగాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ సంఘటన బాచుపల్లిలో వార్డు కార్యాలయం ఎదుట సోమవారం చోటుచేసుకుంది. కౌన్సిల్ సమావేశంలో ఆస్తిపన్ను విషయంపై చర్చించి కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినా ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలపై ప్రజలతో కలిసి వినూత్నంగా ధర్నా చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంతో ప్రభుత్వ దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లే ప్రయత్నం చేశారు. పెంచిన ఇంటి పన్నును తగ్గించాలని కోరుతూ బాచుపల్లిలో వార్డు కార్యాలయం ఎదుట సోమవారం బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రజలతో కలిసి ధర్నా నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా నిజాంపేట్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఆగం పాండు మాట్లాడుతూ.. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నిజాంపేట్, ప్రగతి నగర్ ప్రాంతాలకు ఒక విధంగా ఆస్తి పన్ను ఉంటే బాచుపల్లి ప్రాంతానికి మరో విధంగా ఉందన్నారు. దీంతో బాచుపల్లి ప్రాంతం ప్రజలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఒకే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతాల్లో ఆస్తిపన్నుల హెచ్చుతగ్గులను ఇప్పటి వరకు అధికారులు సరిచేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కాసాని సుధాకర్, ఆగం రాజు, బాలాజీ నాయక్, మాజీ ఎంపీటీసీ నందిగామ సత్యనారయణ, దూసకంటి వెంకటేశ్, సీతారం రెడ్డి, నర్సింహ, కమ్మెట భూపాల్, కృష్ణా, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్ రామకృష్ణారావుకు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

నాలెడ్జి సిటీలో 'డబుల్ బుక్ లాంచ్'

రాయదుర్గం: హ్యాపీ ఎవల్యూషన్ వ్యవస్థాపకురాలు, రచయిత పల్లవిజవార్ రచించిన రెండు పుస్తకాలను సోమవారం నాలెడ్జి సిటీలో డబుల్ బుక్ లాంచ్ పేరిట ఆవిష్కరించారు. తల్లిదండ్రుల వద్ద సంతోషకరమైన వాతావరణం, మన జీవితంలో మంచి క్షణాలు తదితర అంశాలపై ఆమె పుస్తకం రాశారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కీస్టోన్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్, వ్యవస్థాపకుడు శ్రీలక్ష్మీరెడ్డి, శ్రీరామ్ హైదరాబాద్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్, వ్యవస్థాపకురాలు సింధూరి కందుకూరి, మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ శుభావిల్లాస్, పారిశ్రామిక వేత్త అల్కాబంగర్, రచయిత అంజుపొద్దార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రచయిత పల్లవిజవార్ మాట్లాడుతూ పిల్లల పెంపకంపై ఈ పుస్తకం పలు సృజనాత్మక మార్గాలను అందిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఆర్కిటెక్చర్ కళాశాలలో ధరణి దినోత్సవం

మాదాపూర్: ధరణి దినోత్సవాన్ని పురస్కరించుకుని మాదాపూర్‌లోని శ్రీ వేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కళాశాలలో కెనడియన్ వుడ్ సహకారంతో డిజైన్ కాంపిటీషన్‌ను నిర్వహించారు. నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులు తమ నమూనాలను ప్రదర్శించారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, డైరెక్టర్ ఎస్. అజితా శేఖర్, కళాశాల ప్రిన్సిపల్ కామినిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా సగర మహాసభ ఎన్నికలు

హిమాయత్‌నగర్: అఖిల భారత సగర మహాసభ జంట నగరాల శాఖ ఎన్నికలు పారదర్శకంగా ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారని మహాసభ అధ్యక్షుడు ముత్యాల హరికిషన్ సాగర్ తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అఖిల భారత సగర మహాసభ జంట నగరాల శాఖ నూతన కార్యవర్గ సభ్యులు కొండల అనిల్ కుమార్ సాగర్, కుమటం వేణుగోపాల్ సాగర్, శ్రీధర్, జగన్మోహన్‌రావు, రాజశేఖర్ రావు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించండంటే.. 'మా పరిధిలోకి రాదంటున్నారు'

సుభాష్‌నగర్: స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ అధికారులు తమ పరిధిలోకి రాదంటే.. తమ పరిధిలోకి రాదని చెప్పడంతో ఆ కాలనీవాసులు తలలు పట్టుకుంటున్నారు. సూరారం డివిజన్ శ్రీరామ్‌నగర్‌లోని కమ్యూనిటీహాల్ వద్ద కొన్ని నెలలుగా మ్యాన్‌హోల్ నుంచి మురుగు పొంగిపొర్లుతోంది. దీంతో కాలనీవాసులు వాటర్ వర్క్స్, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయగా తప్పించుకునే ధోరణి అవలంభిస్తున్నారు. తాము ఎవరిని కలవాలో అర్థం కావడం లేదని... ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



శ్రీరామ్‌నగర్ కమ్యూనిటీహాల్ వద్ద పొంగిపొర్లుతున్న మురుగు

థాట్ లీడర్స్ ఇన్ ది మేకింగ్



సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి

దుండిగల్: విద్యార్థుల్లోని సృజనాత్మకకు వెలికి తీసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బౌరంపేటలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ బల్జీత్ ఒబెరాయ్ అన్నారు. సోమవారం పాఠశాలలో ×టెడ్×ఔ పేరుతో థాట్ లీడర్స్ ఇన్ ది మేకింగ్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ఐదు నుంచి ఏడు సంవత్సరాల పిల్లలు సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్, పిల్లల హక్కులపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బల్జీత్ ఒబెరాయ్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం పిల్లల్లో ఒక మార్పును సూచిస్తుందన్నారు. చిన్న వయస్సులోనే ప్రపంచ సమస్యలతో నిమగ్నమవ్వడం ద్వారా కేవలం నేర్చుకోవడమే కాదు, ప్రపంచాన్ని చూడగలుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ నందిని, విద్యార్థులు పాల్గొన్నారు.

జన జాతరకు తరలిన కాంగ్రెస్ దళం



సభకు తరలివెళ్తున్న శ్రీశైలంగౌడ్, భూపతిరెడ్డి తదితరులు

కుత్బుల్లాపూర్: మల్కాజ్‌గిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా శామీర్‌పేట్‌లోని అంతాయిపల్లిలో జన జాతర ఏర్పాటు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యే బహిరంగ సభకు కుత్బుల్లాపూర్ నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, నేతలు బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, కొలన్ గోపాల్‌రెడ్డి, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, రాముగౌడ్, బొంగునూరి కిశోర్‌రెడ్డి, మిద్దెల యాదిరెడ్డి, జెమ్మి దేవేందర్, కొలన్ రాజశేఖర్ రెడ్డి తదితరులు తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.



బొంగునూరి కిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో తరలి వెళ్తున్న కాంగ్రెస్ నేతలు



ఐడీపీ గాంధీనగర్ ప్రాంతంలో ఓ పరిశ్రమ ముందు షెడ్డు ఏర్పాటు చేసిన వాహనాల పార్కింగ్



ఓ పరిశ్రమ ముందు దర్జాగా షెడ్డు ఏర్పాటు చేసిన దృశ్యం



రంగారెడ్డినగర్‌ను ఆనుకుని ఉన్న పారిశ్రామికవాడ ప్రాంతంలో మొక్కలు ఎండిపోగా మిగిలిన ఫెన్సింగ్ రాడ్లు

పచ్చదనం ప్రదేశాలు.. పార్కింగ్ అడ్డాలు!



పచ్చదనాన్ని పెంపొందించాల్సిన ప్రాంతంలో బైక్‌లు పార్కింగ్

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఐడీఏ, సీఈఈ గాంధీనగర్ ప్రాంతాల్లోని పరిశ్రమల కాలుష్యాన్ని అరికట్టడానికి ఐలా అధికారులు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ మేరకు పారిశ్రామికవాడ ప్రాంతంలో పచ్చదనాన్ని పెంపొంచడానికి వారు కేటాయించిన ప్రదేశాలు ఆక్రమణలకు.. పరిశ్రమల వాహనాల పార్కింగ్‌లకు అడ్డాగా మారిపోయాయి. ఐలా ఆధ్వర్యంలో రూ.లక్షలాది నిధులు వెచ్చించి మొక్కలు నాటారు. అయితే చాలా పరిశ్రమల వద్ద పచ్చదనం కరుమరుగై ఆ ప్రదేశాల్లో వాహనాలను నిలిపే షెడ్డులు దర్శనమిస్తున్నాయి. పారిశ్రామిక వాడ ప్రాంతంలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి నెలకొంది.



జగద్గిరిగుట్ట-ఐడీపీఎల్ రోడ్డును ఆనుకుని ఐలా ప్రాంతంలో వెలిసిన డబ్బాలు

పదేళ్లుగా వేలాది మొక్కలు నాటారు...

ప్రతిఏడాది రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే హరితహారం కార్యక్రమంలో భాగంగా గత పదేళ్లుగా గాంధీనగర్ పారిశ్రామికవాడలో వేలాదిగా మొక్కలను నాటుతూ వచ్చారు. అయితే ఆర్భాటంగా మొక్కలు నాటిన అధికారులు ఆ తరువాత వాటి పరిరక్షణను గాలికొదిలేశారు. మొక్కలను నీళ్ల పోయకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో ఎండిపోగా, మిగతా ప్రాంతాల్లో కంపెనీల యాజమాన్యాలు వాటిని రూపురేఖలు లేకండా మాయం చేసి తమ సొంత అవసరాలకు వినియోగిస్తున్నాయి.

మొక్కలు నాటిన ప్రాంతాల్లో కంచెల తొలగింపు

రోడ్ల వెంబడి మొక్కలు నాటిన ప్రాంతాల్లో కంచెలను తొలగించి కొందరు డబ్బాలను ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో పారిశ్రామిక ప్రాంతంలో పచ్చదనం అనేది లేకుండా పోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పర్యావరణాన్ని పెంపొందించేందుకు వదిలిన ఖాళీ ప్రాంతాల్లో పరిశ్రమల యాజమాన్యాలు ఆక్రమించి నెలకొల్పిన షెడ్లను తొలగించి మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. మరి సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందిస్తారో లేదో వేచి చూడాలి.



గాంధీనగర్ రోడ్డులో ఓ పరిశ్రమ యాజమాన్యం రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన పార్కింగ్ షెడ్డు